

# సంబంధం

చిత్ర

చల్లారిపోతున్న పాయసాన్ని చూస్తూ కూర్చున్నాను. ఆలోచనలు ఈగలే కాదు, తేనెటీగలే కాదు, అవి ఒక్కోసారి తుమ్మెదలూ అవుతాయి. నాలుగు రోజులైంది నేనిక్కడికొచ్చి. ఈ యిల్లూ, యీ వాతావరణమూ, మరీ ముఖ్యంగా ఈ మనుషులూ, అంతా కొత్త కొత్తగా వుంది.

కొత్తగానా? ఏమిటన్నానూ? కొత్తగానా?

పుట్టిన వూరు, కన్నతల్లి, కొత్తగా వున్నాయా?

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ...'

అది సినిమా పాటేనా?

ఏమో నాకు తెలిసిందంతా అంతే. అది సినిమా పాటే.

"అదేమిటమ్మా మనీ! పాయసం తాగనే లేదు!"

అవును తాగనే లేదు. తాగనూ లేను.

"ఏమ్మా తాగవు? అయ్యో! చల్లారేపోయింది."

చల్లారిందా? చల్లగా అయిపోయిందా?

'వుండు, వెచ్చబెట్టి తీసుకొస్తాను."

"వద్దమ్మా!"

"అదేం మాటమ్మా!"

"చల్లారిపోయిన పాయసమూ, పోగొట్టుకున్న బాల్యమూ..."

వంగుని కప్పు తీస్తున్నదల్లా చివ్వున తలెత్తి చూసింది అమ్మ.

పోగొట్టుకున్న బాల్యం... ఎంత బరువుగా వుందీ మాట!

ఎవరు? ఎవరది? ఎవరు ఆ మాటన్నది?!

మనోజ్ఞ, మనో, మనీయేనా... నా మనీ!

"వేడి చేస్తే మళ్లీ రుచి- అదే ఆ 'పెలాటబిలిటీ' రావచ్చేమో కానీ, ఆ సౌరభం, ఆ ఒరిజినాల్టీ రాదమ్మా!"

అమ్మా! అమ్మ, అమ్మా, అన్నదా తను?

రెసిడెన్షియల్ స్కూల్లో, ఇంగ్లీషు మీడియంలో పదిహేనేళ్లు చదివిన తాను-

ఏమన్నాను? అమ్మా అన్నానా? అమ్మ!

నాలో ఈ బరువేమిటి? మాటలకి ఈ కరువేమిటి?

ఏమన్నానూ? ఒరిజినాల్టీ రాదా? పోగొట్టుకున్న బాల్యమా?

నేను పోగొట్టుకున్నానా? ఎవరైనా లాగేసుకున్నారా?

అమ్మ దగ్గరగా వచ్చి గెడ్డం పట్టుకుని మొహం పైకెత్తి-

"మనీ," అంది మెల్లగా, "ఏమిటమ్మా ఏమిటీ ప్రాబ్లం?"

"ఏం లేదమ్మా!"

"నే(నా మనీ. నేనమ్మా. మమ్మీ"

మమ్మీ! మమ్మీవా? అమ్మా, నువ్వు మమ్మీవా?

ఆ పిలుపుకోసం గదూ నువ్వు తపించిపోయింది. ఈ పిలుపుకోసం గదా...

"చెప్పమ్మా. నాక్కూడా చెప్పకపోతే ఎలాగరా. చెప్పమ్మా!"

దగ్గరగా వచ్చి కూచుంది.

లేదమ్మా! మనమధ్య ఆ దగ్గరితనం లేదు. ఎందుకు ఈమెని చూస్తే ఆ సాన్నిహిత్యం కలగదు? ఎందుకు ఆ ఆత్మీయత వుప్పొంగదు? ఎందుకు? ఎందుకని? ఆ గుండెల్లో తల పెట్టుకు ఏడవాలని

పించదు? ఆ ఒళ్లో తలపెట్టుకు సేదతీరాలనిపించదు? అసలీవిడ అమ్మేనా! అమ్మే!!

తెల్లటి గౌను వేసుకుని వీధిలో కెళ్లి బురద చేసుకొచ్చి నేను ఏడిపించిన అమ్మే!!! పదిహేనేళ్ల కాలం నన్ను దూరం చేసిందా?

"ధనం! అమ్మాయిని డిస్టర్బ్ చెయ్యొద్దన్నానా? చదువుకోనియ్యకుండా ఎందుకలా సొళ్లు పెడతావు? రా యిటు."

అవును. సొళ్లు, సొళ్లు.

మాట్లాడుకోవడం అంటే సొళ్లు. కష్టాలు పంచుకోవడం సొళ్లు. కన్నీళ్లు తుడుచుకోవడం సొళ్లు. అభిమానాలూ, ఆప్యాయతలూ- అన్నీ సొళ్లు... సొళ్లు. చదువు, చదువొక్కటే మనకి-

పట్టణానికి దూరంగా, పగలంతా భారంగా బతికే రెసిడెన్షియల్ స్కూల్‌కి మూణ్ణెళ్లకోసారి 'విజిట్' చేసి వీళ్లిద్దరూ, ఈ పదిహేనేళ్లపాటూ అడిగిందేమిటి?

"ఏమ్మా! ఆరోగ్యం బావుంది కదా!"

'ఆరోగ్యమా! ఆరోగ్యం అంటే అవయవాలు అందంగానూ, ఏపుగానూ పెరగడం కాదమ్మా! సంతోషం కావాలమ్మా! ఆనందం కావాలమ్మా,' అని చెప్పనిచ్చేరా అసలు నన్ను.

"కులాసాగా వున్నావు కదమ్మా," అనేవారు.

'కులాసా అంటే, బట్టలు కాదమ్మా! ఐస్‌క్రీములు కాదు. మనసు కులాసాగా వుండాలి. అది జివ్వుమనాలి. సముద్రంలా పొంగిపోవాలి. గాలిలా తేలిపోవాలి.'

అనగలిగేనా, అననిచ్చేరా?

"హేపీగా వున్నావు కదా! ఓకే!" అని తేల్చేసేవారు.

'హేపీ, హేపీగా వున్నానా- నేను? లేను నాన్నా. నేను హేపీగా లేను. చిన్న సైకిలు నేర్చుకుంటూ పడిపోయి దెబ్బ తగిల్తే అమ్మ ఆ దెబ్బలకి సగం కోపంతోనూ, పూర్తి ప్రేమతోనూ మందు రాస్తుంటే, తిడుతుంటే అప్పుడు నాన్నా నేను 'హేపీ'-

అనేంత భాష, భావం నాకు వుండేవా?

నా ఆరో ఏట, బాగా గుర్తు... సరిగ్గా ఆరో ఏట-

ఈ చిన్నవూళ్లో చదువు బావుండదనీ, ట్రాన్స్‌ఫర్లు అవుతాయనీ, చదువు రాకపోతే బతుకు బాగుండదనీ, రెసిడెన్షియల్ స్కూల్లో పడేసేరు. అక్కడే పదేళ్లు- అవును పదేళ్లు, గడిచిపోయేయి. కాదు, గిడసబారి పోయేయి.

బర్ర్...ర్ర్...ర్ర్... ర్ర్... ఏదో చప్పుడైంది. గేటు కాబోలు.

"ఎవరు ఇడియట్స్. అంత చప్పుడు..." అనుకుంటూ బయటికెళ్లేడు నాన్న.

ఆయనకి మేనర్సంటే ఎంతో ఇష్టం. రోజుకి కనీసం నాలుగైదుసార్లయినా అమెరికానీ, ఇంగ్లండునీ పొగడకుండా వుండలేరు.

"బాబు! కుబేరం బాబూ! కుబేరం బాబూ!"

ఒత్తుగా కనుబొమలూ, తెల్లగా జుట్టూ, చేతులో చుట్టా, దృఢంగా శరీరమూ, ముతక బనీనూ, మాసిన పంచా- ఎవరో పల్లెటూరి ఆసామీలా వున్నాడు.

"నువ్వటోయ్ నాయుడూ, దాదా."

నాన్న ఇంత ఓర్పుగా వున్నాడూ అంటే ఎవరో బాగా కావలసినవాడూ, మనకి పనికొచ్చేవాడూ అయి వుండాలి. మాటల మధ్యలో-

"అమ్మా మనీ, రా. ఇతను, నాయుడని, మన భూములు అవీ చూస్తూ వుంటాడు."

"అమ్మాయి మన పాపే కదూ! నానెప్పుడు ఇనడమేగాని, చూడనేదు."

"ఆ... ఇక్కడ లేదు. పట్నంలో రెసిడెన్షియల్ స్కూల్లో చదువుకుంటూ అక్కడే వుండిపోయింది కదా! అందుకే నువ్వు చూడలేదు."

"ఏమి స్కూలు బాబూ?"

"రెసిడెన్షియల్ స్కూలు. అంటే- అక్కడే వుండిపోయి చదువుకోవడం అన్నమాట!"

"ఏటి, రాత్రీ, పగలు సదువే?" నాయుడికి మా గొప్ప ఆశ్చర్యంగా వుంది.

"ఆ! మరేవిటనుకున్నావు? మంచి చదువు రావాలంటే అలాగే చెయ్యాలి."

"అయితేటి బాబూ! అమ్మా అయ్యా నేనట్టు అక్కడే వుండిపోవడమా? సెలవులకీ రాదా?"

"రాదోయ్. సెలవుల్లో కంప్యూటర్ కోర్సులనీ, క్రాష్ కోర్సులనీ, పై చదువులకి ఎంట్రన్సుకి కోచింగనీ, చాలా తతంగం వుందోయ్. ఖాళీయే వుండదు."

"అయితే బాబు- ఏటి సదివిందండి అమ్మలు?"

"ఎంబీబీఎస్సోయ్. డాక్టరు పాసైంది."

"డాక్టరే!!! అమ్మా నమస్కారమమ్మా," రెండు చేతులూ జోడించేడు.

డాక్టరనగానే నాయుడికి గౌరవమో, భయమో కలిగినట్టుంది. ఎప్పుడైనా తనకి జబ్బొస్తే మందిస్తానని ఆశ కలిగిందేమో!

"అయితాకేటి. అమ్మలుకి పెల్లి సేసీరా?"

ఫక్కున నవ్వాడు నాన్న. "లేదోయ్, అప్పుడే చేసుకోనంటోంది. ఇంకా పై చదువులకి అమెరికాగానీ, ఇంగ్లండుకానీ వెళ్తానంటోంది."

'అబద్ధం! డాడీ ఇది అబద్ధం! నేను అనలేదు. ఆ కోరిక నాకు లేదు.

'నాకు ఇంగ్లండంటే విసుగు. అమెరికా అంటే అసహ్యం. ఆ పరుగుల పోటీలు అంటే చిరాకు. ముఖ్యంగా చదువంటే భయం. నాకు తోడు కావాలి, నాన్నా! విశ్వం కావాలి.'

'నాకు పక్షులు కావాలి, పాటలు కావాలి.

'పచ్చని పొలాలు కావాలి. వెచ్చని ప్రేమలు కావాలి.

'ఇవేవీ కాదని. నా విశ్వం నుంచి దూరం చేస్తూ, నన్ను తోలేస్తున్నది మీరు. అంతస్తుల వేటలో నన్ను విదేశాలకి తోసేస్తున్నదీ మీరే.'

'నాన్నా. ఇది హిపోక్రసీ కాదు. అబద్ధం. ఎ గ్రాండ్ లై!'

"బాబూ! నాకు తెలకడుగుతానూ. అమ్మాయిని మన సుందరం బాబుకిచ్చి..."

"ఛా. ఎవడు మా అక్కయ్య కొడుకు సుంద రానికా! ఛ. ఛ. లేదోయ్. పల్లెటూరు కదా? ఏవో పుకార్లు. అంతే!"

"అదేటి బాబు! అలాగంతారు. అయిన సంబంధం. ఆయినా బానే సదివేడు గదా!"

"చదివాడోయ్, ఎం.డీ. చదివేడు. కానీ ఏంటి లాభం? ఆ వూరు వొదల్డుట. అక్కడే ప్రాక్టీసు పెడతాట్ట. వేలకి వేలు పోసి, సంవత్సరాల తరబడి చదివించి, దరిద్రులకి సేవలు చేస్తూ ధర్మాత్ముడని పనికిమాలిన బిరుదొకటి తగిలించుకుని అడుక్కుతిండానికా?"

నాయుడికి ఎక్కడో పేగు కదిలినట్టుంది. తత్వం తలకెక్కినట్టుంది. నోట మాట రాలేదు. ప్రాణవాయువు బరువెక్కింది. నేను లోపలికెళ్లేను.

అవును. ఇంత చదువుకున్నది దరిద్రులకీ, అనాథలకీ సేవలు చెయ్యడానికి కాదు. అమెరికాకి ఎగిరిపోవడానికి, ఇంగ్లండు పారిపోవడానికి. నేను అమెరికా వెళ్లాలి. బాగా చదువుకోవాలి.

భవిష్యత్తు ఎలా వుంటుందంటే...

కుమారి లేదా శ్రీమతి మనోజ్ఞ ఎం.డీ., ఎఫ్.ఆర్. సీ.పీ.గారు పొద్దున్న ఎనిమిది నించి ఒంటిగంటవరకూ, మళ్లీ మధ్యాహ్నం నాల్గు నుంచీ రాత్రి తొమ్మిదివరకూ పేషెంట్లని చూస్తారు. అత్యవసర కేసులు అధిక ఫీజులు తీసుకుని అన్నివేళలా చూస్తారు. ఇంటికొచ్చి భోంచేసి పడుకుంటారు. ఆదివారం ఆపరేషన్లు చేస్తారు.

ఆవిడకున్న ఫారిన్ కారు ఆరు లక్షలు!

ఆవిడ ఇల్లు ఇరవై లక్షలు!

ఆవిడ తీసుకునే ఫీజు మూడొందలు.

ఆవిడ మరో పెద్ద నర్సింగ్‌హోమ్ కడుతున్నారు. మరందుకు డబ్బు కావాలి కదా! అందుకోసం ఆవిడ అక్కర్లేని హిస్టారెక్టమీలు. అదుపు లేకుండా సిజేరియన్లూ చేస్తారు. అసలావిడ పేరే ఆపరేషన్ల డాక్టరు!?...

రాత్రి శ్రీమతి మనోజ్ఞ ఇంటికొచ్చేసరికి, శ్రీవారు క్లబ్బుల్లోనైనా వుంటారు. లేదా వారూ డాక్టరు అయితే, ఆసుపత్రిలో వుంటారు. వారు ఇంటికొచ్చేక కట్టబోయే నర్సింగ్‌హోంకి కొనబోయే స్థలానికి అవసరమయ్యే డబ్బు గురించి ప్రణాళికలు వేసుకుని అటు తిరిగి పడుకుంటారు...

"బాబూ! ఈ ఒక్క సాయం సేసిపెట్టండి," నాయుడంత పెద్దవాడు నాన్నని బతిమాలుతున్నాడు.

నాన్న, పల్లెటూళ్లో వున్న పొలాన్ని అమ్మకానికి పెట్టేట్ట. వేరే వాళ్లెవరో ఎక్కువ రేటిస్తామని వస్తే నాన్న ఒప్పుకున్నాట్ట. వాళ్లకి కాకుండా తనకే ఆ భూమి అమ్మమని పట్టుపడుతున్నాడు నాయుడు.

"నువ్వు కొనలేవోయ్ అంత రేటు పెట్టి."

"బాబూ! నా తంటాలేవో నాను పడతాను. ఆడదాని ఒంటిమీద ఒస్తువులు అమ్మో, మరోటో సేస్తాను. అప్పో, సప్పో సేసి తమ డబ్బుకి నోటు రాని య్యను. నాకార్నెల్లు గడువిప్పించండి," అంటున్నాడు.

"ఎందుకయ్యా! అన్నీ పాట్లుపడి ఆ పొలం కొనడం. నీకు తక్కువలో వేరే పొలం దొరుకుతోంది కదా," తేల్చేస్తున్నాడు నాన్న.

"దొరుకుద్ది బాబూ! దొరుకుద్ది. కానీ బాబూ మీ తండ్రిగారి కాన్నుంచి ఆ పొలం నాను దున్నినాను. అందల కూకుని నాను వణ్ణం తిన్నాను. పెల్లాన్నింటి కాడొగ్గేసి పచ్చుల్ని తోలతా అందల పడుకుండిపోన్ను. బాబూ! భూమి మీదైనా, అందులోకి... ఆ మట్టిలోకి, ఆ బురదలోకి తమరు దిగనేదు. కాబట్టి కోపమొస్తే కొట్టేయండిగానీ, ఆ భూమి తోటి మీకు సంబంధం నేకపోవచ్చును. నాకూ ఆ భూమికి ఏభై ఏళ్ల సంబంధం. ఆ భూమి నాతోని మాటాడుద్ది బాబూ- నాను పిలిస్తే పలుకుద్ది. అందల పంట తిని నాను పెరిగినాను. ఇయ్యాల ఆ పొలాన్ని మరొకడికిచ్చీడమంటే బాబూ! తల్లిని తార్సినట్టుంటాది."

నాయుడు ఏడుస్తున్నాడా? కేవలం మానసిక సంబంధం కోసం ఎత్తుకెత్తు డబ్బిచ్చి అది కొని అప్పుల పాలైపోడానిక్కూడా సిద్ధపడుతున్నాడా? ఏమిటన్నాడు

నాయుడు? సంబంధం అన్నాడా? నాన్నకీ, తాతకీ అది లేదన్నాడా? ఎంత బాగా అన్నాడు!! వేసవి సెలవుల్లో- సెలవులేనా అవి?... అప్పుడు మమ్మీ, డాడీ నన్ను చూడ్డానికి స్కూలుకొస్తే-

''డాడీ! నాకు పిన్ని పిల్లల్తో, మావయ్యల పిల్లల్తో ఆడుకోవాలనుంది,'' అంటే-

''తప్పమ్మా! ఇక్కడ బోల్డుమంది ఫ్రెండ్సున్నారు కదా! వాళ్లతో ఆడుకో,'' అన్నాడు.

''వీళ్లంతా ఆడుకోరు డాడీ. ఎప్పుడూ చదువు కబుర్లే. ఎప్పుడూ లెక్కలూ, సైన్సు ఇదే గొడవ. టీచర్లేమో అస్సలు ఆడుకోనివ్వరు...'' అని కళ్లనీళ్లు తిరిగితే లొంగడానికి ఏమాత్రం యిష్టంలేని నాన్న ఏమన్నాడు?-

''నేను చెప్తానమ్మా టీచర్లకి- నిన్ను ఆడుకోనిమ్మని!''

''అలాక్కాదు, డాడీ! వాళ్లంతా మనవాళ్లు కదూ డాడీ, మన సంబంధీకులు గదా.''

''సంబంధం ఏమిటమ్మా! సంబంధం. నువ్వు బాగా చదువుకోవాలి.''

''ఎందుకు నాన్నా! ఎందుకు చదువుకోవాలి నాన్నా?'' అంటే-

''బాగా చదువుకుంటే మంచి వుద్యోగం వస్తుందమ్మా!''

''మంచి వుద్యోగం వస్తే ఏమవుతుంది నాన్నా?''

''మంచి ఉద్యోగం వస్తే నీకు బోల్డు జీతం వస్తుందీ. అప్పుడు నువ్వు ఎంచక్కా అన్నీ కొనుక్కోవచ్చు. టీవీ, విసిపి, ఫ్రిజ్జూ- అన్నీనీ, ఎంచక్కా పెద్ద కార్లో తిరగొచ్చు. పేద్ద ఇల్లు కట్టుకోవచ్చు. మంచి మంచి బట్టలేసుకోవచ్చు.'

ఇలా వూరించి బెల్లించపోతున్నపుడు-

'నాన్నా! నాకవన్నీ కాదు నాన్నా. మనుషులు, మనుషులు కావాలి నాన్నా. నాకు ప్రేమ కావాలి నాన్నా. మానవ సంబంధాలు కావాలి నాన్నా,' అనగలిగేనా? అనే ఆలోచన, వూహా, నాకున్నాయా? అంత ఆలోచించే ఓపిక, తీరిక నాకు మిగిలేయా? క్లాస్ ఫస్టు వస్తే గర్వపడడమూ, జబ్బు చేస్తే 'అమ్మా' అని ఏడవడమూ తప్ప, కాంక్రీటు గోడల మధ్య, క్లాసురూంలో జనరల్ నాలెడ్జి పుస్తకాలతో కుస్తీలో, 'స్కూలు బయట ప్రపంచం ఒక టుందనీ, అందులో మానవులుంటారనీ, చదువంతా మానవుల కోసమే,'ననీ, విశ్వం, గుండెల మీద గుద్ది చెప్పేవరకూ నాకు తెలిసిందా?

మమ్మీ డాడీలు ఎక్కడికో బయల్దేరుతున్నారు; 'ఎక్కడికమ్మా' అంటే-

ఎర్రంరాజుగారింట్లో పుట్టిన్రోజు పార్టీకట. నాకూ వెళ్లాలనుంది. కానీ రానివ్వరు. నాకు తెలుసు. చదువుకోవాలి. అమెరికా వెళ్లాలి. వీలైతే అక్కడే వుండిపోవాలి. బోల్డంత సంపాదించాలి. వచ్చెయ్యడం తప్పనిసరైతే వచ్చి మరో అమెరికా మొహంవాణ్ణి కట్టుకోవాలి. పెద్ద ఆసుపత్రి కట్టి అందర్నీ పిండెయ్యాలి. అందరికీ దూరంగా, ఆప్యాయతలకి దూరంగా, విశ్వంకి దూరంగా వెళ్లిపోవాలి-

టీవీ ముందు కూర్చున్నాను.

పళ్లపొడుల దగ్గర్నుంచి, పరుపుల వరకూ, విస్కీలు, బ్రాందీలు అన్ని రకాల చెత్త ఎడ్వర్టయిజుమెంట్ల పేరు మీద ఆడదాని ఒంపు సొంపుల్ని చూస్తూ రారమ్మని పిలిచేవాళ్ల దైన్యాన్నీ, పిలిపిస్తున్న వాళ్ల హైన్యాన్నీ, చూస్తూ. ఇందుకా ఈ టీవీలు కొన్నది? 'బాబోయ్! నాకీ వస్తువులొద్దు, మనుషులు కావా'లని ఏడుస్తుంటే-

రాత్రి అయినట్టుంది-

మమ్మీ డాడీ వచ్చారు.

''మనీ. నీకిష్టమని కాడ్‌బరీస్ తెచ్చాను,'' అంటాడు నాన్న. ఎప్పుడో తన చిన్నప్పటి ఇష్టాలే తెలిసిన నాన్న. నాకు అపరిచితుడైన నాన్న-

''అయ్యో! అన్నం పెట్టుకు తినమన్నానే. తిన్లేదా? నీకిష్టమని వంకాయ కూర చేసేను,'' అంటుంది మమ్మీ. అదంటే నాకు ఎలర్జీ వచ్చిందని తెలీని అమ్మ.

రాత్రి భోజనం అయ్యేక పోస్టంతా చింపుకుని, ఎలాట్ అయిన షేర్లు నోట్ చేసుకోవడం, రిఫండు వారంట్లకి బాంకు చలానాలు, మరుసటి రోజు పెట్టవలసిన షేర్లకి అప్లికేషన్లూ నింపుకోవడం.. చేస్తాడుట డాడీ-

ఆ సమయలో గట్టిగట్టిగా కేకలు వేస్తూ ఎవరినో తిడుతున్నాడు.

పదిహేనేళ్ల క్రితం ఎక్కడో దూరంగా, ఎవరో స్కీం వేస్తే నాన్న నలభై టేకు చెట్లు కొన్నాట్ట. అవి పాతికేళ్లు పోయాక లక్షలు కురిపిస్తాయని నమ్ముకున్నాట్ట. తీరా ఇవాళ ఆ చెట్లు చచ్చిపోయాయని రాశార్ట. అందుకు ఆ కంపెనీ వాళ్లని నానా భాషల్లోనూ తిడ్తున్నాడు.

''అంత కోపం పడకపోతే ఒకసారి ఆ వూరెళ్లి నిజంగా ఆ చెట్లు చచ్చిపోయాయో లేదో, అవి మన చెట్లు అవునో కాదో చూసి రారాదుటండీ'' అంటోంది మమ్మీ.

"ఎలా? ఎలా ధనం? ఎలా చూడ్డం. మనం పెట్టుబడి పెట్టాం కానీ, ఏ చెట్టు మనదో, మనకెలా తెలుస్తుంది? ఎప్పుడో పదిహేనేళ్ల క్రితం వేసిన నెంబర్లు ఇంకా వుంటాయా? చెట్టు బెరడు కట్టదా? ఆ పొలం చూడలేదు. అన్ని చెట్లూ ఒక్కలాగే వుంటాయిగదా! ఎలా మన చెట్లు గుర్తుపట్టడం? కేవలం మనం డబ్బు కట్టాం. పెట్టుబడి పెట్టాం. అంతే, ముంచేశారు..."

"పోనీలెండి. ఆ చెట్లు మళ్లీ మొక్కలు పాతుకో వచ్చు."

"నా శ్రాద్ధం... నీ పిండాకూడు. మనకి కేవలం ఆ చెట్లమీదే కానీ అవి పెరిగే భూమి మీద హక్కు లేదు..."

నాకు తెరలు తెరలుగా ఏడుపొస్తోంది. కెరల్లు కెరల్లుగా నవ్వొస్తోంది.

డబ్బు పెట్టుబడి పెట్టి లాభాల కోసం చూశావు. కానీ డాడీ! ఏనాడైనా ఒక బాల్చీడు నీళ్లు పోసేవా? గంపెడు గెత్తం వేసేవా? కనీసం ప్రేమగా చెయ్యివేసి నిమిరేవా, నాన్నా! పెరుగు, పెరుగు అన్నావే కానీ ఆ మొక్కలు, వాటితో- నాయుడేమన్నాడూ- 'పొలం నేను పిలిస్తే పలుకుతుంది,' అన్నాడు. స్థాయి పడి నిద్రల కుపక్రమించేరు.

మమ్మీ అంటుంది డాడీతో -

"మనీ వరస నాకేం బోధపడటం లేదండీ. ఏం మాట్లాడదు. చనువుగా వుండదు. ఏదో కొత్త యింటి కొచ్చినట్టు ఆలోచిస్తూ కూచుంటుంది. తనకు ఏమి యిష్టమో చెప్పదు. నాకు తెలీదు..."

అవును మమ్మీ, తెలీదు. అది నీ తప్పు కాదు. చదువు యావలో పదిహేనేళ్లు దూరంగా తోసేసి, సెలవుల్లో కూడా ఇక్కడికి రాకూడదనీ, వస్తే ఈ వాతావరణం నన్ను చెడగొట్టేస్తుందనీ జాగ్రత్తలు తీసుకున్నారే. అదీ మీ తప్పు కాదు. నా చదువు తెచ్చే లక్షలు కావాలి తప్ప ఇంత ప్రేమ, ఆప్యాయత ఏదీ వద్దు. ఇంత దూరంగా వున్న నన్ను భౌతికంగా గుర్తుపట్టేవు కానీ మానసికంగా మర్చిపోయావమ్మా. నా రుచులూ, ఇష్టాలే కావు. నా ఆనందాలూ, హాబీలు ఏవీ మీకు తెలీవు. నా శరీరం ఒడ్డూ పొడుగులు, టేకు చెట్లలాగ, మీకు తెలుసేమోగానీ నా మనసు లోతులు తెలీవమ్మా. మనం ఈరోజు అపరిచితులం మాత్రమే కాదు ఆత్మ విరోధులం కూడా.

ఆలోచనల్లోనే నిద్ర పట్టినట్టుంది. భయంకరమైన కల.

ఎవరో పుస్తకాలు త్రాసులో వేసేరు. నేను నా మెదడుని మరోపక్క వేసేను. ఈలోగా నా హృదయం నేలమీద జీరాడుతోంది. ఎవరో పుస్తకాలు తీసేసి డబ్బు కట్టలు వేస్తున్నారు. ఇంకా ఇంకా ఎన్నో కట్టలు. హఠాత్తుగా మెదడు గాలిలోకి తేలిపోవడం మొదలెట్టింది. ఎవడో డాక్టరొచ్చి కంప్యూటర్‌తో పరీక్షించేడు. 'దీనికి హృదయంతో సంబంధం లేదు. తెగిపోయింది. పనికి రాదు. పారెయ్యండి,' అంటున్నాడు. ఎవరో ఎత్తి నన్ను కుళ్లు కాలవలోకి రయ్యిన విసిరే... వులిక్కిపడి లేచేను-దాహం. దాహం. మంచినీళ్లు తాగేను-నిద్ర పట్టలేదు. లైటు వేసి ఉత్తరం మొదలెట్టాను.

"ప్రియతమా విశ్వం,

"నీతో పందెంలో నేను ఓడినా బతుకులో గెలిచాను. నువ్వు అన్నట్టుగానే ఇక్కడ నాకంతా కొత్తగానూ, పరాయిగానూ వుంది. ఇక్కడ పుస్తకాలన్నీ డబ్బు వాసనేస్తున్నాయి. జీవితం పునాది మీదికి నన్ను దింపినందుకు కృతజ్ఞతలు చెప్పనా? రోబోకి అనుభూతులు నేర్పి ప్రాణం పోసిన నీకు నన్నే అర్పించుకోవడం కంటే ఏం చెయ్యగలను? భ్రమలు విడిపోయేయి.

"నువ్వన్నట్టే పోదాం. ఎక్కడ విజ్ఞానం వికాసానికి తోడ్పడుతుందో అక్కడికే పోదాం. మన శ్రమ ఇతరుల శ్రమని తగ్గించాలిగానీ ఇతరుల శ్రమని దోచుకోడానికి కాదు అన్నది ఎంత బాగా అన్నావు?

"నాకు ఆశయాలు తెలీవు. ఎక్కడ కనీసం నా శ్రమఫలితం నేను అనుభవించగలనో, ఎక్కడ వస్తువుల కంటె మనుషుల కెక్కువ విలువ వుందో అక్కడికే పోదాం. వస్తున్నాను. నీతో కలిసి గడిపే ఆహ్లాదకరమైన సాయంకాలం కోసం, నీతో పంచుకునే విశ్రాంతిగల రాత్రుల కోసం..."

*ప్రజాసాహితి మాసపత్రిక ఆగస్ట్, 1994*

